

దసరా ఉత్సవాల్లో అల్లర్లు లేకుండా చూడాలి: ఎస్పీ

విజయనగరం క్రైం, అక్టోబరు 5: జిల్లాలో దసరా ఉత్సవాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్‌జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ నెల 12 వరకూ నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి ఊరేగింపులు, నిమజ్జనాలు శాంతియుతంగా ముగిసేలా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఊరేగింపుల్లో ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా విద్యుత్‌శాఖాధికారులకు సమాచారం అందించాలన్నారు. నిమజ్జనం చేపట్టే చెరువులు, నదుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల గురించి తెలుసుకుని అప్రమత్తం చేయాలన్నారు.

గడపగడపకు ఒట్టిమాటలే

● వందల్లో పనులు, కోట్లలో నిధులు అంటూ ప్రగల్భాలు ● మెంటాడలో జరిగినవి 16 పనులు, ఖర్చు రూ.28 లక్షలే
● వాటిలోనూ బిల్లులు అందక కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్న వైనం ● జిల్లా అంతటా ఇదే వరస

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలే మారిపోతాయని ఊరూరా నాడు చేసిన ప్రకటనలు ఒట్టి మాటలేనని తేలిపోయింది. కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పెద్దసంఖ్యలో అభివృద్ధి పనులు మంజూరు చేశామన్నవి గాలికబుర్లేనని అధికారిక రికార్డుల సాక్షిగా నిరూపితమైంది. మంజూరైన పనులన్నింటికీ అడర్లు కూడా ఇచ్చేసామని చెప్పినవి కూడా బోగస్ అని రూడీ అయిపోయింది. మెంటాడ మండలంలో జరిగిన వ్యవహారం ఇందుకు ఒక ఉదాహరణగా చెప్పొచ్చు.



మెంటాడ, అక్టోబరు 5:
ప్రజలను ఏమార్చడానికి గత వైసీపీ సర్కారు ఎన్నికల ముంగిట తెరపైకి తెచ్చిన కార్యక్రమాల్లో ఒకటైన గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో గ్రామాల్లో చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ప్రతి పంచాయతీకి రూ.పది లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమం అంటూనే పార్టీనేతలంతా గ్రామాల్లో ఇంటింటి పర్యటనలతో హోరెత్తించి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల మంజూరు ముసుగులో పక్క ఎన్నికల ప్రచారమే చేశారు. మెంటాడ మండలం విషయానికొస్తే ఈ కార్యక్రమం ద్వారా 31 పంచాయతీల్లో 2 కోట్ల 72 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 111 సీసీ రోడ్లు, కాలువల అభివృద్ధి పనులు మంజూరు చేశామని, నిధుల సమస్యతో సంబంధం లేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయిస్తామని, ఒకేసారి ఇన్ని పనులు మంజూరు చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని వైసీపీ నేతలతో పాటు అధికారులు కూడా జబ్బలు చరుచుకున్నారు. ప్రజలు కూడా వీరిమాటలను నమ్మి, ఆ పనులన్నీ పూర్తయితే ఊర్లు బాగుపడతాయని భావించారు. ఎప్పటికప్పుడు వరుస పొడగింపులతో ఈ కార్యక్రమాన్ని ఎన్నికల షెడ్యూల్ విడుదల వరకూ సాగదీసి తర్వాత ఎలక్షన్ కోడ్‌ను బూచిగా చూపి నిలిపేశారు. పనులు ప్రారంభంకాలేదేంటని ఎవరైనా అడిగితే, టీడీపీ వాళ్లు ఆపించేశారని తప్పుడు ప్రచారానికి తెగబడ్డారు. ఎన్నికల్లో లబ్ధి అంతిమ లక్ష్యంగా కథలు అల్లారు. వారి నిజస్వరూపం తాజాగా బట్టబయలైంది. రూ.2 కోట్ల 72 లక్షలతో 111 అభివృద్ధి పనులు మంజూరైనట్టుగా వారు చెప్పింది ఒట్టి బోగస్ అని బయటపడింది. గడపగడపకు కార్యక్రమం ద్వారా కేవలం 28.90 లక్షల రూపాయల అంచనా వ్యయంతో కూడిన 16 పనులు మాత్రమే జరిగాయని అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో కొంతమందికి ఇంకా బిల్లులు చెల్లించక వారంతా లబోదిబోమంటున్నారు.

● మాటల కనికట్టుతో ప్రజలను మాయ చేసిన వ్యవహారం ఆధారాలతో సహా బయటపడటంతో వైసీపీ నాయకులు మన్నుతిన్న పాములా మిన్నకుండిపోతున్నారు. అధికారులేమో గణాంకాలు ముందుంచి ఇందులో తమ పాత్ర ఏమీలేదని, ప్రభుత్వం చెప్పమన్న మాటలే చెప్పామని చెప్పుకొస్తున్నారు.



గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు ఇలా..

ఎరక్కపోయి ఇరుక్కు పోయాము

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రత్యేక నిధులు మంజూరులో జాప్యం జరగదని, చేసిన పనులకు బిల్లులు వెనువెంటనే చెల్లింపులు జరిగిపోతాయని చెప్పిన మాటలు నిజమని నమ్మి మోసపోయామని వైసీపీ నాయకులు లబోదిబోమంటున్నారు. అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా నష్టపోయామని మథన పడుతున్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని...ఏదోలా బిల్లులు చెల్లింపులు జరిగిపోతాయని ఆశించినట్లు చెబుతున్నారు. రెండింటికీ చెడ్డ రేవడిలా తమ భవిష్యత్ తయారైందంటున్నారు.



అమ్మవారికి 108 రకాల ప్రసాదాలు

బొబ్బిలి, అక్టోబరు 5: బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి శ్రీదాడితల్లి అమ్మవారిని శనివారం అన్నపూర్ణాదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పిండిప్రోలు మణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కుంకుమపూజలు చేశారు. అలాగే అమ్మవారికి 108 రకాల ప్రసాదాలు నివేదించారు.



గాయత్రీదేవిగా అమ్మవారు

చీపురుపల్లి, అక్టోబరు 5:
శరన్నవరాత్రులు పురస్కరించుకుని కనకమహాలక్ష్మి అమ్మవారు శనివారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూడో రోజున కూడా ఆలయ ప్రాంగణంలో చండీయాగం, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఈవో బి.శ్రీనివాస్, అర్చకులు ఆరవెల్లి భవానీశంకర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏం చేయాలి?

● అడ్డుకుంటే నిర్మాణదారుల నుంచి ఒత్తిడి
● పట్టించుకోకపోతే వివాదాలకు దారి
● ఎస్.కోట రెవెన్యూకు తలనొప్పిగా మారిన ఇసుక తవ్వకాలు

శృంగవరపుకోట, అక్టోబరు 5:
ఇసుక తవ్వకాలు శృంగవరపుకోట రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. తవ్వకాలు జరగకుండా అడ్డుకుంటే నిర్మాణదారుల నుంచి ఒత్తిడి వస్తోంది. చూసీ చూడనట్లు వ్యవహరిస్తే వివాదాలకు కారణమవుతోంది. దీంతో ఏం చేయాలో అర్థంకాక రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.
వైసీపీ ప్రభుత్వం ఇసుకను అమ్ముకుంది. నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరగనివ్వలేదు. ఆ పార్టీకు చెందిన నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు చెందిన వారు మాత్రమే వ్యాపారం చేసుకొనేలా వ్యవహరించింది. వారు మాత్రమే నాటు బండ్లతో ఇసుకను తోలుకొనేలా చేసింది. కేవలం వైఎస్ఆర్ కాలనీలో కడుతున్న ఇళ్లకు మాత్రమే ఇసుకను సరఫరా చేశారు. దీంతో ఇసుక దొరకడమే గగనమై నిర్మాణ రంగం కుదేలైంది. నాలుగు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. అయితే శృంగవరపుకోట మండల పరిధిలో గోస్తనీ నది ప్రవహిస్తోంది. దీంట్లో తవ్వకాలకు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, అనంతగిరి వారికి కూడా ఇసుకను స్థానిక అవసరాల కోసం వినియోగించుకోనేందుకు నాటు బండ్లను నదిలో దించేందుకు అనుమతించింది. అయితే దీన్ని అదనుగా తీసుకున్న వ్యాపారులు నాటు బండ్లను కొనుగోలు చేసి సొంత అవసరాల పేరుతో లోడు రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. రోడ్డుకం బ్రిడ్జిలు, ఊటబావుల సమీపంలోనూ ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ఒకరిద్దరు ప్రజా ప్రతినిధుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లను దించేస్తున్నారు. గోస్తనీ నది బ్రిడ్జి, ఊటబావుల వద్ద తవ్వకాలు చేస్తున్న మూడు నాటుబండ్లను నాలుగు రోజుల క్రితం తహసీల్దార్ ఎం.అరుణకుమారి పట్టుకున్నారు. ఒక్కోబండికి రూ.2వేలు చొప్పున జరిమానా విధించారు.

● పర్యావరణానికి నష్టం జరగకుండా నాటుబండ్లతో ఇసుకను తవ్వకొనేందుకు ఇచ్చిన అనుమతులను గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతల బంధువులమంటూ ఒకరిద్దరు వ్యాపారులు అతి చేస్తున్నారు. ఈ క్రమంలో నదీ పరివాహక ప్రాంతాల గ్రామాల వ్యాపారులు మిగిలిన గ్రామాల నాటుబండ్లను అడ్డుకుంటున్నారు. ఈ కట్టడితో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ పరిణామాలతో రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.





ఎస్.కోట రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న నాటుబండ్లు

రండి.. ఇళ్లు కట్టుకోండి

● భరోసా ఇస్తున్న కూటమి ప్రభుత్వం
● జగనన్న కాలనీ లబ్ధిదారులకు ప్రోత్సాహం
● మౌలిక సౌకర్యాల కల్పనకూ హామీ
● నాడు ఎక్కడికక్కడే పడకేసిన నిర్మాణాలు

రాజాం, అక్టోబరు 5:
వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో 1,16,447 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం సాయంతో కలిపి రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు మంజూరు చేయగా.. ఇళ్ల స్థలాలు ఇచ్చామన్న నెపంతో జగన్ ప్రభుత్వం రూ.20 వేలు తగ్గించి రూ.1.80 లక్షలు అందించడానికి నిర్ణయించింది. అయితే పెరిగిన గృహనిర్మాణ సామగ్రి ధరలతో ఆ మొత్తం ఎటూ చాలక లబ్ధిదారులు విముఖత చూపారు. ఇప్పటికీ 16,947 మంది అసలు పనులే ప్రారంభించలేదు. విజయనగరం జిల్లాలో 81,999 ఇళ్లు మంజూరు చేయగా ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తయినవి 43,328 మాత్రమే. ఇందులో 11,191 ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు పనులే ప్రారంభించలేదు. మన్యంలో కూడా ఇదే పరిస్థితి. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు అవసరమైన చోట్ల వర్క్ ఇన్‌స్పెక్టర్ల నియామకం చేపట్టాలని కూడా భావిస్తోంది.

కేంద్ర ప్రభుత్వం మెలిక..

గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొత్తగా పేదల గృహనిర్మాణానికి అవరోధాలు ఏర్పడుతున్నాయి. గతంలో మంజూరైన ఇళ్లలో నిర్ణీత శాతం పూర్తయితే కానీ కేంద్రం కొత్త ఇళ్లు మంజూరుచేసే అవకాశం లేదు. అందుకే కూటమి ప్రభుత్వం వైసీపీ హయాంలో మంజూరైన ఇళ్ల నిర్మాణం పూర్తిచేయడానికి చర్యలు చేపడుతోంది. గత కొద్దిరోజులుగా ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడంతో ప్రధాని మోదీ గృహనిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. రాష్ట్రంలో సైతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరవుతాయని ఆశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 పథకం కింద..ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.4 లక్షలు అందించనున్నారు. అంటే వైసీపీ హయాంలో కంటే ఇంటి నిర్మాణ సాయం రూ.2.20 లక్షలు పెరగనుందన్న మాట. కానీ వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం పుణ్యమా అని ఇళ్ల మంజూరులో జాప్యం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం గృహనిర్మాణం విషయంలో ప్రత్యేక వ్యూహంతో ఉండడంతో త్వరలో పెండింగ్ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



రాజాం: కంచరాం వద్ద అర్థాంతరంగా నిలిచిన పేదల గృహాల నిర్మాణం

లబ్ధిదారులను కలుస్తున్నాం

వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. లబ్ధిదారులను కలిసి పనులు ప్రారంభించేలా ఒత్తిడి చేస్తున్నాం. సిబ్బంది కొరత దృష్ట్యా కాంట్రాక్టు ప్రాతిపదిక నియమించేందుకు చర్యలు చేపడుతున్నాం. వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తాం. కొత్త ఇళ్ల మంజూరుకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

- ఎ.శ్రీనివాస్, హౌసింగ్ పీడీ, విజయనగరం

మార్క్‌ఫెడ్ అభివృద్ధికి కృషి

● రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందిస్తాం
● మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

డెంకాడ, అక్టోబరు 5: రాష్ట్రంలో రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించి రైతు శ్రేయస్సుతో పాటు మార్క్‌ఫెడ్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని రాష్ట్ర మార్క్‌ఫెడ్ నూతన చైర్మన్ కర్రోతు బంగార్రాజు తెలిపారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఎండీ జిలానీసామూన్ సమక్షంలో శనివారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఎంతో రుణపడి ఉంటానని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతు రాజు అయ్యేలా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, విశాఖ నార్త్ నియోజకవర్గం టీడీపీ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, టీడీపీ భోగాపురం అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పదవీ బాధ్యతలు చేపట్టిన మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజుతో ఎండీ, డైరెక్టర్లు



రాజేంద్రప్రసాద్ ఇంట విషాదం

గుండెపోటుతో కూతురు గాయత్రి మృతి

సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఇంట విషాదం నెలకొంది. ఆయన కూతురు గాయత్రి (38) హఠాన్మరణమే ఇందుకు కారణం. శుక్రవారం రాత్రి ఛాతీలో నొప్పితో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆమె.. చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచారు. మరణానికి కారణం గుండెపోటని డాక్టర్లు తెలిపారు. సినీ ప్రముఖులు చిరంజీవి, వెంకటేశ్, అల్లుఅర్జున్, సాయికుమార్, ఎన్టీఆర్, త్రివిక్రమ్‌తో పాటు కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, రాజేంద్రప్రసాద్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు.

కూతురిలో తల్లిని చూసుకుంటూ...

2018లో 'బేవర్స్' అనే సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో భావోద్వేగానికి గురయ్యారు రాజేంద్ర ప్రసాద్. ఆ వేడుకలో ఆయన మాట్లాడుతూ "నా పదవ ఏట అమ్మను కోల్పోయాను. అమ్మ నన్ను వదిలివెళ్లడంతో తట్టుకోలేకపోయాను. నా జీవితమంతా అమ్మ లేని లోటు నన్ను వెంటాడుతూ ఉండేది. కానీ గాయత్రి పుట్టాక.. తనలోనే అమ్మను చూసుకున్నాను. కానీ ఇప్పుడు నాకు, నా కూతురికి మాటలు లేవు. నా అంగీకారం లేకుండానే తను ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి తనతో మాట్లాడటం మానేశాను. ఈ సినిమా కోసం సుద్దాల అశోక్ తేజ రాసిన పాట 'తల్లీ తల్లీ నా చిట్టి తల్లి నా ప్రాణాలే పోయాయమ్మా.. నువ్వే లేని లోకాన నేను శవమల్లే మిగిలానమ్మా' విన్నాను. విన్న వెంటనే నా కళ్ల నిండా కన్నీళ్లొచ్చాయి. ఆ రోజు సాయంత్రం నా కూతురిని ఇంటికి పిలిపించి ఈ పాటను నాలుగు సార్లు తనకి వినిపించాను. ఆ పాట విన్నాక నా కూతురిపై కోపం పోయింది. అమ్మ చనిపోయినప్పుడు ఎలా అయితే ఏడ్చానో.. అలా ఏడ్చేశా" అని అన్నారు. కాగా, రాజేంద్రప్రసాద్‌కు తన కూతురు గాయత్రి అంటే పంచప్రాణాలు. ఈ మధ్యనే తనకు ఓ ఖరీదైన కారు, విలాసవంతమైన భవంతిని బహుమతిగా ఇచ్చారు. గాయత్రి న్యూట్రీషియనిస్ట్‌గా పనిచేసేవారు. కే.పీ.హెచ్.బీలోని తన భర్త రాజ్ కుమార్, కూతురు సాయితేజస్వినితో ఉండేవారు. సాయితేజస్విని 2018లో విడుదలైన 'మహానటి' సినిమాలో చిన్ననాటి సావిత్రి పాత్రతో బాలనటిగా వెండితెరపై అరంగేట్రం చేసింది. ఆ తర్వాత మూడు సినిమాల్లో నటించింది. కేపిహెచ్‌బీలోని ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్స్ విల్లా నెంబర్ 266లో ఉన్న రాజేంద్రప్రసాద్ నివాసానికి గాయత్రి పార్థీవ దేహాన్ని తీసుకొచ్చారు. అక్కడకు రాజకీయ సినీ ప్రముఖులు వచ్చి పార్థీవ దేహానికి నివాళులర్పించారు. కేపీహెచ్‌బీ ఏడో ఫేజ్‌లోని హిందూ స్మశాన వాటికలో నేడు ఉదయం పది గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



గద్దలకొండ... తరహాలో

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా దర్శకుడు కరుణకుమార్ తెరకెక్కిస్తున్న పీరియాడిక్ చిత్రం 'మట్కా'. నవంబర్ 14న విడుదలవుతోంది. డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. నోరా ఫతేహి,మీనాక్షి చౌదరి కథానాయికలు. నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్ కీలకపాత్రలు పోషించారు. శనివారం చిత్రబృందం విజయవాడలోని రాజ్ యువరాజ్ థియేటర్‌లో 'మట్కా' టీజర్‌ను ఆవిష్కరించింది. నాలుగు విభిన్నమైన పాత్రల్లో వరుణ్‌తేజ్ మేకోవర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'నేను 'గద్దల కొండ గణేశ్' సినిమా చేశాక చాలా మంది 'మరోసారి అలాంటి సినిమా చేయండి'అని అడిగారు. 'మట్కా' కూడా అదే తరహాలో ఉండబోతోంది. నా కెరీర్‌లో గర్వపడే సినిమా అవుతుందని భావిస్తున్నాను' అని చెప్పారు. వరుణ్‌తేజ్‌ను ఇప్పటిదాకా చూడని సరికొత్త పాత్రలో చూడబోతున్నారు అని కరుణ కుమార్ చెప్పారు. ఇప్పటివరకూ ఒక లెక్క, ఇకపై వరుణ్ కటౌట్ మరోలెక్క అన్నట్లుగా సినిమా ఉండబోతోందని డా. విజయేందర్‌రెడ్డి చెప్పారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఏ. కిశోర్ కుమార్



ఆకట్టుకునే నాన్న కథ

సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మించారు. ఈ నెల 11న విడుదలవుతోంది. శుక్రవారం ఈ చిత్రం ట్రైలర్‌ను మహేశ్‌బాబు విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కన్నతండ్రి, పెంచిన తండ్రి ప్రేమను పొందేందుకు కథానాయకుడికి ఎదురైన ఇబ్బందులు ఏమిటి?, ఆ సమస్యను అధిగమించేందుకు అతను ఎలాంటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాడు అనే అంశం చుట్టూ ఆసక్తికరంగా అల్లుకున్న కథ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఇందులో ఆర్నా కథానాయికగా నటిస్తున్నారు. సాయిచంద్, షాయాజీ షిండే ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: జై క్రిష్, సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి.

ఆ 30 నిముషాల ట్రైన్ ఎపిసోడ్ అలరిస్తుంది



గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందుతున్న 'విశ్వం' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శ్రీను వైట్ల మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు వెల్లడించారు.

● గోపీచంద్‌తో సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాం. ఆయన్ని దృష్టిలో పెట్టుకుని రాసిన కథ ఇది. ఆయనకు నచ్చి ఓకే చేశారు. నా శైలిలో రావాలని ఎనిమిది నెలలు టైమ్ తీసుకున్నా. అభిరుచి కలిగిన నిర్మాత దోనేపూడి ప్రసాద్‌తో పాటు విశ్వప్రసాద్ కూడా జాయిన్ అవడంతో సినిమాకు మరింత బలం వచ్చింది. యాక్షన్, హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్‌తో సినిమా ఉంటుంది. ఇందులో ఓ పాప పాత్ర కీలకంగా ఉంటుంది.

● దర్శకుడిగా నాకు గ్యాప్ వచ్చినా సినిమాలు చూస్తూ వస్తున్న మార్పులు గమనిస్తూనే ఉన్నా. నా శైలి గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతూనే ఉంది. ఏదో ఒక చోట నా కంటెంట్ వస్తూనే ఉంది. థీమ్‌లు రిపీట్ అవుతున్నాయని అంటున్నారు. దాన్ని క్రాక్ చేయడానికి టైమ్ పడుతుంది.

● పదేళ్ల క్రితం హీరో తెలివితేటలతో ఏదైనా సాధించగలడనే కథలు వచ్చాయి. ఈ సినిమా అలా ఉండదు. ఒక బర్నింగ్ ఇష్యూ తీసుకుని వినోదాత్మకంగా చెప్పా. మేకింగ్ వైజ్ వినూత్నంగా ఉంటుంది. నాకు, గోపీకి ఫ్రెష్ ఫిల్మ్ అవుతుంది.

● ఈ సినిమాలోనూ ట్రైన్ ఎపిసోడ్ ఉంది. ట్రైన్ ఎపిసోడ్ అనగానే 'వెంకీ' సినిమాతో కంపేర్ చేస్తారని తెలుసు. కానీ దానికీ దీనికీ చాలా తేడా ఉంటుంది. 30 నిమిషాల పాటు వెన్నెల కిశోర్, గణేశ్, నరేశ్, కవిత, చమ్మక్ చంద్ర, షకలక శంకర్‌లతో ట్రైన్ జర్నీ బాగుంటుంది.

● విశ్వం అనే పాత్ర జర్నీ ఈ చిత్రం. ఎమోషనల్ యాక్షన్ సినిమా అని చెప్పవచ్చు. జర్నీలో విశ్వానికి ఎలాంటి వ్యక్తులు కలిశారు, ఆ విషయాలు ఏమిటి అనేవి ఆసక్తికరంగా ఉంటుంది. కంటెంట్ స్ట్రాంగ్‌గా ఉంటేనే థియేటర్‌కు ప్రేక్షకులు వస్తున్నారు. ఆడియన్స్ కూడా వెంకీ తరహా సినిమాలు మిస్ అవుతున్నాయని అంటున్నారు. అందుకే కేర్ తీసుకుని ఈ సినిమా చేశా.

ఇన్ ప్రోగ్రెస్

మాస్ పాత్రలో తొలిసారి



వెంకట్ హీరోగా నటించిన 'హరుడు' చిత్రం గ్లింప్స్ శనివారం విడుదల చేశారు. రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం దర్శకుడు రాత్రింబవళ్లు కృషి చేశారు. సినిమాలోని పాటలు ఆదరణ పొందుతాయి' అన్నారు. కథ విన్న ఐదు నిముషాల్లో ఒకే చేసిన నిర్మాతకు దర్శకుడు కృతజ్ఞతలు తెలిపారు. వెంకట్ ఐదేళ్ల జర్నీ ఉందనీ, ఆయన ఇందులో మాస్ హీరోగా నటించారని చెప్పారు. హీరో వెంకట్ మాట్లాడుతూ 'కమర్షియల్ ఎలిమెంట్స్ కలిగిన మాస్ చిత్రం ఇది. షూటింగ్‌తో పాటు 60 శాతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ఇందులో తొలిసారిగా మాస్ పాత్ర చేశాను. నా పాత్రకు దీటుగా హెబ్బా పటేల్ పాత్ర ఉంటుంది. నటాషాసింగ్ మరో పాత్ర చేసింది. సలోని స్పెషల్ సాంగ్ చేసింది' అని చెప్పారు.

టైమ్ ట్రావెల్ మూవీ



సాయిరోనక్, అమృత చౌదరి జంటగా నటించిన 'రివైండ్' చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఎన్నారై కల్యాణ్ చక్రవర్తి స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా నిర్మించారు. శనివారం విడుదల చేసిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో హీరో మాట్లాడుతూ 'మంచి కంటెంట్ ఉంటే కచ్చితంగా ప్రేక్షకులు ఆదరిస్తారు. అందుకే మంచి కథను ఎన్నుకుని మాకున్న బడ్జెట్‌లోనే సినిమా తీశాం. మా దర్శకుడు కల్యాణ్ ఎన్నారై అయినా ఇక్కడికి వచ్చి డబ్బు పెట్టి మంచి కథతో సినిమా తీయడం అభినందనీయం' అన్నారు. 'ఆదరణ ఉంటుందని మేం కూడా టైమ్ ట్రావెల్ కథను ఎన్నుకొని ఆసక్తికరంగా చిత్రాన్ని రూపొందించాం. ప్రేక్షకులకునచ్చుతుందని మా నమ్మకం' అని చెప్పారు దర్శకనిర్మాత కల్యాణ్.



అలరించే హంగులతో...

శ్రద్ధాదాస్, అజయ్, మాస్టర్ మహేంద్రన్ ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'త్రికాల'. 'స్క్రిప్ట్ ఆఫ్ గాడ్' అనేది ట్యాగ్‌లైన్. మణి తెల్లగూటి దర్శకత్వంలో రాధికా శ్రీనివాస్ నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం టైటిల్ పోస్టర్‌ను నిర్మాత దిల్‌రాజు ఆవిష్కరించి యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పురాణాల స్ఫూర్తితో రాసుకున్న కథ ఇది, ఈతరం ప్రేక్షకులను అలరించేలా అన్ని హంగులతో తెరకెక్కించాం అని దర్శకుడు తెలిపారు. సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించే చిత్రమిదని నిర్మాత చెప్పారు. సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, సినిమాటోగ్రఫీ: పవన్ చెన్నా

జాతీయ పురస్కారం రద్దు



మహిళా కొరియోగ్రాఫర్‌పై అత్యాచారం కేసులో పోక్సో చట్టం కింద అరెస్టయిన టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు అందించాల్సిన జాతీయ అవార్డును రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం శనివారం నిర్ణయం తీసుకొన్నది. ఈ నెల 8న ఢిల్లీలో జరగనున్న జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో జానీ మాస్టర్ ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా అవార్డును అందుకోవాల్సి ఉంది. 2022 సంవత్సరానికి గాను తమిళ చిత్రం 'తిరుచిత్రంబలం'కు గాను ఆయనకు ఈ పురస్కారం లభించింది. దీంతో ఆ వేడుకలకు హాజరయ్యేందుకు ఆయన బెయిల్ కోరగా రంగారెడ్డి కోర్టు మంజూరు చేసింది. కానీ అత్యాచారం కేసులో అరెస్టవడంతో కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఇవ్వాల్సిన పురస్కారాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

22 ఏళ్ల తర్వాత...



క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ దర్శకత్వంలో రవితేజ, శ్రీకాంత్, ప్రకాశ్‌రాజ్, సోనాలిబింద్రే నటించిన చిత్రం 'ఖడ్గం' రీ రిలీజ్‌కు సిద్ధమైంది. సినిమా విడుదలైన 22 ఏళ్లకు రీ రిలీజ్ అవుతుండడంతో చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకులు కృష్ణవంశీ మాట్లాడుతూ "భారతీయ జెండా ఒక ఖడ్గం అనే ఉద్దేశం వచ్చేలా ఈ సినిమాకు టైటిల్ పెట్టాం. ఇన్నేళ్ల తర్వాత రీ రిలీజ్ అవుతుండడంతో చాలా సంతోషంగా ఉంది" అని చెప్పారు.

నియామక ఉత్తర్వులు చెల్లవు

కలెక్టరేట్: బొబ్బిలి సీబీఎం బాలికోన్నత పాఠశాలకు సంబంధించి కన్వీనర్, కరస్పాండెంట్‌లు ఆయా పా ఠశాలలో చేసిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది నియామకాలు నిబంధనలకు విరుద్ధమని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా చేసినందున ఆయా నియామక ఉత్తర్వులు చెల్లవని శనివారం ఆయన ఒక ప్రకనటలో స్పష్టం చేశారు.

సందడిగా అన్నసమారాధన

జామి: జామి బజారుసెంటరులో గోస్తనీ మహిళలు ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం సందడిగా అన్నసమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

గోతులు పూడ్చండి

జామి: మండలంలోని భీమసింగి వంతెనపై ఉన్న పెద్ద పెద్ద గోతులను కప్పించడంతో పాటు వంతెనపై లైటింగ్ ఏర్పాటు చేయిచాలని, విజయనగరం దారిలో ఉన్న గోతులను కప్పించాలని కోరుతూ జిల్లా ఆర్‌అండ్‌బీ ఈఈకి మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు శనివారం వినతి పత్రం అందించారు. ఈ గోతుల వల్ల నిత్యం ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవిస్తున్నాయని, వీటిని నివారించాలని కోరారు.

12న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రామభద్రపురం: మండలంలోని ఆరికతోటలో ఈనెల 12న అంబేడ్కర్, జగ్జీవన్‌రావు విగ్రహాలను ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ ఆవిష్కరించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోగి శ్రీను మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ కు సంబంధించి విజయోత్సవ సభ నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు పెంకి రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌ను విజయవంతం చేయాలి

రామభద్రపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల ఎనిమిదో తేదీన బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో జరగనున్న ప్రజాదర్బార్ విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు కోరారు. శనివారం బూసాయవలసలో విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకుడు సువ్వాడ హరి బాబు, రౌతు శంకరరావు, సీర వేణు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాలి

రాజాం: ప్రతి ఒక్కరూ వారి రక్తం గ్రూపును తెలిసుకోవాలని జీఎంఆర్ఐటీ ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. శనివారం రాజాంలో 1200 మందికి బ్లడ్ గ్రూపింగ్‌చేసి కార్డులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాజాం అధ్యక్షుడు కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, నాగేశ్వరరావు, ఆర్ ఎల్ నాయుడు, కేవీఎస్ ప్రసాద్, పెంకి చైతన్యకుమార్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

రేగిడి: ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే చొరవచూపి పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతంచేస్తామని ఆశావర్కర్ల యూనియన్ మండల గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామమూర్తినాయుడు, యూనియన్ మండలాధ్యక్షురాలు రత్నకూమారి తెలిపారు. శనివారం మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఆశావర్కర్ల యూనియన్ మండల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్లకు ప్రభుత్వాలు గొడ్డుచాకరీ చేయించుకుని, వారి హక్కులు కాలరాసి అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో కార్యదర్శి సావిత్రి, ప్రతినిధులు శాభారాణి, నాగమణి, ఈశ్వరమ్మ, అమ్మాజమ్మ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై ఆసక్తి పెంచుకోండి

వేపాడ: జిల్లా రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుకు ముందుకు రావాలని జిల్లా వ్యవసాయాధికారి విటి.రామారావు పిలుపునిచ్చారు. శనివారం వేపాడ మండలంలోని వల్లంపూడి, వేపాడ, దబ్బిరాజుపేట, గ్రామాల్లో రైతులు సాగు చేపట్టే ప్రకృతి వ్యవసాయ సాగు ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కొత్తవలస వ్యవసాయశాఖ ఏడీఏ ఎల్ విజయ, మండల వ్యవసాయాధికారి యశ్వంతరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. ● **బొబ్బిలి రూరల్:** మండలంలోని కృష్ణాపురంలో శనివారం ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు రైతులకు తూటికాడ కషాయం తయారుచేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సింహాచలం, ఐసీఆర్‌పీ జి.శ్రీరామ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

సంతకవిటి తహసీల్దార్‌గా సత్యం

సంతకవిటి: సంతకవిటి తహసీల్దార్‌గా బి.సత్యం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్ గా పనిచేసిన టి.కల్యాణ చక్రవర్తి పలాస తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

వెలుగు ఏపీఎంగా భాగ్యలక్ష్మి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పక్కి భాగ్యలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన శ్రీనివాసరావు ఎస్.కోట శ్రీనిధి మేనేజర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో బాడంగి మండలం నుంచి భాగ్యలక్ష్మి బదిలీపై వచ్చారు. భాగ్యలక్ష్మివెలుగు కార్యాలయ సిబ్బంది అభినందించారు.

కొత్తవలస ఎంపీడీవోగా రమణయ్య

కొత్తవలస: కొత్తవలస ఎంపీడీవోగా రమణయ్యను నియమించారు. ఇటీవల జరిగిన రెగ్యులర్ బదిలీలలో ఇక్కడ పని చేస్తున్న వై.పద్మజను కురుపాం బదిలీ చేయగా ఆమె స్థానంలో శ్రీ కాకుళం జిల్లా నుంచి కొత్తవలస మండలానికి రమణయ్య బదిలీపై వచ్చి జాయిన్ అయ్యారు.

ప్రజలకు మరిన్ని సదుపాయాలు కల్పిస్తాం

● బస్సు సర్వీస్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట: ప్రజలకు అన్ని రంగాల్లో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం శృంగవరపుకోట ఆర్టీసీ డిపో నుంచి విశాఖపట్టణానికి పల్లె వెలుగు బస్సును ప్రారంభించారు. నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని ఆర్థికంగా నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి నిమిత్తం విశాఖకు వెళ్లే వారందరికీ ఈ బస్సు అనుకూలంగా ఉంటుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జీ.ఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి కాపుగంటి వాసు, భీశెట్టి అరుణ, పెదగాడ రాజు తదితరులున్నారు.



ఎస్.కోటలో పల్లె వెలుగు బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

కోర్టు భవనాల నిర్మాణానికి కృషి



శృంగవరపుకోట: శిథిలావస్థలో ఉన్న శృంగవరపుకోట కోర్టు భవనాల స్థానంలో కొత్త కోర్టు భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా కృషి చేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి అన్నారు. శనివారం విజయనగరం రోడ్డులో తాత్కాలిక జూనియర్ సివిల్ జడ్జి, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు భవనాలను ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేశారు. తాత్కాలిక కోర్టు భవనాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక న్యాయ మూర్తి సబ్బవరపు వాణి, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ అప్పలనాయుడు, న్యాయవా దుల సంఘ అధ్యక్షుడు జీ.ఎస్ దేముడు, న్యాయవాదులు మండా కామేశ్వరరావు, అల్లు సత్యాజీ, నానిగిరి తులసీ దాస్, బొబ్బిలి రామకృష్ణ, డబ్ల్యూఎస్ శర్మ తదితరులున్నా రు.

తాత్కాలిక కోర్టును ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ చక్రవర్తి

అన్నపూర్ణగా అమ్మవారు

విజయనగరం రూరల్, అక్టోబరు 5: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజుకో అవతారంలో దర్శనమిస్తున్న పైడిమాంబ శనివారం నాడు అన్నపూర్ణ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు.. రైల్వేస్టేషన్ రోడ్డులో వున్న వనంగుడిలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మూడులాంతర్లు రోడ్డులో వున్న పైడిమాంబ చదురుగుడిలో కూడా భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు.. పైడిమాంబకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ● రైల్వే స్టేషన్ రోడ్డులో వున్న పైడిమాంబ వనంగుడిలో అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నారు. శనివారం నుంచి భక్తులు కూర్చొని తినేవిధంగా బెంచీలను ఒక దాత అందించారు..అంతకముందు బఫే విధానంలో అన్నదాన కార్యక్రమం ఇక్కడ జరిగేది.. ఈ నేపథ్యంలో ఆలయ ఈవో డీవీ ప్రసాదరావు ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ఆహారపదార్థాలను వడ్డించారు. బెంచీలను ఇచ్చిన దాతను అభినందించారు.



విజయనగరం: వనంగుడిలోని పైడితల్లి





బొబ్బిలి: అన్నపూర్ణ అలంకరణలో దాడితల్లి అమ్మవారు, బంగారమ్మతల్లి

అన్నపూర్ణాదేవిగా బంగారమ్మతలి

బొబ్బిలి: బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల బంగారమ్మతల్లి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

చదరంగంతో సృజనాత్మకత



కార్యక్రమంలో మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ నేత బాబ్జీ

విజయనగరం దాసన్నపేట: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి చదరంగం క్రీడ ఎంతో దాహోదపడతాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రముఖ చదరంగం క్రీడాకారుడు కేవీ జ్వాలాముఖి ఆధ్వర్యంలో రింగురోడ్డు సమీపంలోని ఫోర్త్, ఫైర్ సెస్ స్కూల్ ఆధ్వర్యంలో రెవెన్యూ హోంలో రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంటు నిర్వ హించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు చదరంగం చాలా ఉపయోగకరమైందన్నారు. జాతీయ స్థాయి చదరంగం పోటీలు విజయనగరంలో అద్భుతంగా జరిగాయని, విద్యార్థులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారన్నారు. జన విజ్ఞానవేదిక జాతీయ నాయకుడు ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ ఇంతటి గొప్ప పోటీలు జరగడం ఆనందంగా ఉంద న్నారు. చెస్ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బీపే రావు మాట్లాడుతూ, ఈ క్రీడలు విద్యార్థులు చక్కగా అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. దామోదరరావు, జగన్నాథ్‌తో పాటు చదరంగం క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామాలపై దృష్టి పెట్టండి

వేపాడ: గ్రామస్థాయిలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై దృష్టిచెట్టి తక్షణమే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని గ్రామ సచివాలయ మహిళా పోలీసులకు వల్లంపూడి ఎస్ఐ బి.దేవి సూచించారు. శనివారం స్టేషన్‌లో ఈ మేరకు ఆమె సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీసులు గ్రామస్థాయిలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను గుర్తించి పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న అక్రమ మద్యం వ్యాపారాలు, కోడిపందాలు, పేకాటపై సమాచారం ఇస్తే వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు.



గ్రామ సచివాలయ మహిళా పోలీస్‌లతో సమావేశమైన వల్లంపూడి ఎస్ఐ దేవి

ఇసుక సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు

● బొబ్బిలి ఆర్డీవో రామ మోహనరావు

తెర్లాం: ఇసుక సరఫరా చేసేందుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని బొబ్బిలి ఆర్డీవో రామ మోహనరావు ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు. శనివారం మండలంలోని కుసుమూరులోని ఇసుకరీచ్‌ను పరిశీలించారు. ఇసుక పంపిణీ ప్రారంభిం చేందుకు అనుకూలంగా ఉండే సౌకర్యాలపై ఆరాతీశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రాజాం: రాజాం శాఖా గ్రంథాలయంలో సైన్స్ సాంఘిక ఉపాధ్యాయులు రౌతు నరసింహప్పడు, కుదమ తిరుమలరావును ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని శనివారం గ్రంథ పాలకుడు యంద్రాపు అమరనాథ్ సన్మానించారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు శాసుబిల్లి హరిబాబు, ఐఈడీ ఉపాధ్యాయలు వి.శ్రీనివాసరావు, వంజరాపు రాము, జగదీష్ ఉన్నారు.

నవదుర్గ అలంకరణ



వేణుగోపాల స్వామి ఆలయంలో నవ దుర్గ అలంకరణ

శృంగవరపుకోట: శృంగవరపుకోట శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం జరగనున్న పూజలకు శనివారం సాయంత్రం నవదుర్గా అలంకరణ చేశారు. ఉదయం 9గంటలకు జరగనున్న నవదుర్గల పూజకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

విజయనగరం క్రైం: జిల్లా పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, నేర ప్రవృత్తిని విడనాడాలని లేకుంటే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకూల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఏస్పీ ఆదేశాలతో జిల్లాలోని పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్ కలిగిన వ్యక్తులను స్థానిక పోలీస్ స్టేషనల్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు మరల నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి సత్ప్రవర్తనతో జీవించేలా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. నేరప్రవృత్తిని విడనాడకుండా నేరాలకు పాల్పడితే ఉపేక్షించవద్దని ఆదేశాంచారు. ప్రస్తుతం వారు ఏ వృత్తిలో కొనసాగుతున్నది కనిపెట్టాలన్నారు. ఎక్కడ ఉంటున్నది అన్న అంశాలను సంబంధి పోలీస్ అధికారులు విచారణ చేసి హిస్టరీ షీట్లులో పొందుపరచాలన్నారు.

కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ

శృంగవరపుకోట: శృంగవరపుకోట కోట వీధిలో కల్వర్టు నిర్మాణానికి తాజా మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శనివారం భూమి పూజ చేశారు. ఈ కల్వర్టు నిర్మాణానికి మండల ప్రజా పరిషత్ రూ.3 లక్షలు మంజూరు చేసింది. ఎంపీపీ సండిసోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ సంతోషి కుమారి తదితరులు ఉన్నారు.



కల్వర్టుకు భూమి పూజ చేస్తున్న ఇందుకూరి రఘురాజు

ఇసుక సమస్య పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

రాజాం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి ఇసుక సమస్య పరిష్కరించాలని, నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజాంలో భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు తవిటినాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు?

● వాడీవేడిగా సాగిన మండల సర్వసభ్య సమావేశం

రామభద్రపురం: సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు ఎందుకు నిర్వహించాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రశ్నించారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన వాడీవేడిగా జరిగింది. తొలుత రొంపల్లి ఎంపీటీసీ భవిరెడ్డి శంకరరావు మాట్లాడుతూ టీడీపీ మద్దతుదారుల పంచాయతీల్లో పనుల విషయంలో అలసత్వం చూపు తున్నారని ఆరోపించారు. అసంపూర్తిగా మిగిలిఉన్న పనులను ఎప్పటిలోగా పూర్తిచేస్తారని ప్రశ్నించారు. ఎంపీటీసీ సభ్యురాలు రవణమ్మ మాట్లాడుతూ కొట్టక్కిలో ఐసీడీఎస్‌కు శాశ్వత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో పిల్లలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జన్నివలస పరిధిలో 1.5 కిలోమీటర్లలో 600 మొక్కలు నాటామని ఏపీవో గొలగాని త్రినాథరావు తెలియజేయగా, అక్కడ మొక్కలు లేకపోయినా బిల్లులు చెల్లిస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు మడక తిరుపతిరావు ఆరోపించారు. రామభద్రపురం కనిమెరక వీధిలో ఇనుప స్తంభాలు మార్చాలని ఎంపీటీసీ సభ్యుడు భవిరెడ్డి చంద్ర కోరారు. మామిడివలసలో తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా ఎందుకుపట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యులు మడ క తిరుపతినాయుడు ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే వల్ల రైతులు నష్టపోయారని మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు తెలిపారు. దీంతో రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీనిపై రైతు లంతా మూకుమ్మడిగా మండల రెవెన్యూ కార్యాలయానికి తాళంవేసే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. కాగా మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల భర్తలు సమావేశంలో ప్రశ్నలు అడగడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. విద్యుత్ తదితర సమస్యలపై సభ్యులు నిలదీశారు. ఆయా శాఖల అధికారులు సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతమ్మ, ఎంపీడీవో రత్నం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





సర్వసభ్య సమావేశం దృశ్యం, అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

రాజాం రూరల్: పట్టణంలోని బొబ్బిలి రోడ్డులోని ఓ ప్రైవేటు జూట్ కర్మాగారంలో కార్మికుడిగా పని చేస్తున్న రాజయ్యపేట గ్రామానికి చెందిన చిన్నారావు (30) శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. విధులు ముగించుకుని బయటకు వస్తున్న సమయంలో కాంపౌండ్‌లో గల స్తంభానికి తాకడంతో విద్యుదాఘాతానికి గురైనట్లు చెప్పారు. చిన్నారావు భార్య చంద్రకళ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామ శివారు మామిడి తోటలో పేకాట శిబిరంపై కొత్తవలస సీఐ షణ్ముఖరావు సిబ్బందితో కలిసి దాడి చేశారు. శనివారం సాయంత్రం వచ్చిన సమాచారంతో ఎస్ఐ సుదర్శనరావు, సిబ్బందితో కలసి పేకాట శిబిరంపై దాడి చేయగా ఒక లక్షా 23 వేల 540 రూపాయలు నగదు, ఒక ఆటో, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

రాజాం రూరల్: రాజాం సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు ఆధ్వర్యంలో సీఐ అశోక్‌కుమార్, సిబ్బంది ఏడాదిగా అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన మద్యాన్ని శనివారం ధ్వంసం చేశారు. 172 కేసులకు సంబంధించి రూ.1.50 లక్షలు విలువచేసే 1215 బాటిళ్లను ధ్వంసం చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

నవరాత్రి ఉత్సవాల్లో అగ్నిప్రమాదం

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని న్యూపూర్ణ సెంటర్, నగర పాలక సంస్థ కార్యాలయం సమీపంలో శనివారం సాయంత్రం శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గా దేవి డెకరేషన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఏటా శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా టాక్సీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. దుర్గాదేవికి డెకరేషన్ చేసిన విద్యుత్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సమీపంలో అగ్నిమాపక కార్యాలయం ఉండడంతో వెంటనే అగ్నిమా పక సిబ్బంది ఫైర్ ఇంజిన్ వాహనం ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక అధికారులు వెంటనే స్పందించడంతో పెద్ద ప్రమా దం త్రుటిలో తప్పింది. దీనిపై అగ్నిమాపక అధి కారి శోమేశ్వరరావు వివరణ కోరగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం సంభవించిందని, సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం ఉంటుందని తెలిపారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుల ప్రతిభ

శృంగవరపుకోట: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అక్టోబరు 1న ఇంటర్ కాలేజ్ బ్యాడ్మింటన్ టీం చాంపియన్ షిప్‌లో శృంగవరపుకోట ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు పంపాన మౌనిక భరణి, కనక హారిక ద్వితీయ స్థానం పొందినట్లు కోచ్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ క్రీడాకారులు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదవుతున్నారు. వీరు ఇంతకు ముందు కూడా అనేక జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించినట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.శివకుమార్ అభినందించారు.



క్రీడాకారులతో కోచ్ శ్రీరాములు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

బొబ్బిలి/రూరల్: బొబ్బిలికి చెందిన షేక్‌అబ్దుల్లా, రెడ్డి సృజన గత నెల 25న విజయనగరంలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్తాచాటి అండర్ -14 రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఎం.సుధాకరయాదవ్ తెలిపారు. ఈ మేరకు వీరు శనివారం నుంచి తిరుపతిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వారిని ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న బేబీనాయన

ఆరుగురు బాల కార్మికుల గుర్తింపు



బొబ్బిలిలో షాపులను తనిఖీ చేస్తున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలి: బొబ్బిలిలో సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, వివిధ శాఖల అధికారులు ఆపరేషన్ స్వేచ్ఛఫేజ్-3 కార్యక్రమంలో భాగంగా శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆరు షాపుల్లో ఆరుగురు బాల కార్మికులను అధికారులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలల సేవలను వినియోగిస్తున్న షాపుల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ బాలలను శారీరక శ్రమతో కూడిన పనుల్లో వినియోగించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌లేబర్ ఆఫీసరు జి.గౌరీశంకర్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వెంకటరమణ, సీఎస్‌డబ్ల్యూవో ప్రతినిధి హరీశ్ పాల్గొన్నారు.

కాపు, బలిజి సంక్షేమసేన అధ్యక్షుడి నియామకం

బొబ్బిలి: బొబ్బిలి నియోజకవర్గ కాపు, బలిజి సంక్షేమసేన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన తెలుగుయువత నాయకుడు నంది హరిప్రకాశ్‌ను నియ మించారు. ఈ మేరకు రాష్ట్రసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య నుంచి ఆయనకు నియామక ఉత్తర్వులు శనివారం అందాయి.

నేటి నుంచి ఏపీటీఎఫ్ మహాసభలు

నెల్లిమర్ల: ఏపీటీఎఫ్ (1938) 80 వసంతాల వేడుకలు, 20వ విద్యావైజ్ఞానిక మహాసభలు ఈ నెల 6వ తేదీ నుంచి విజయనగరం ఫూల్‌బాగ్ రోడ్డులోని జె కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో మూడు రోజుల పాటు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మహాసభలకు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి సుమారు మూడు వేలకు పైగా ప్రతినిధులు, ప్రముఖులు హాజరు కానున్నారు. పతాకాల ఆవిష్కరణ కార్యక్రమం అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు ఆధ్వర్యంలో జరుగనుంది. జాతీయ పతాకాన్ని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఏఐఎఫ్‌ఈఏ పతాకాన్ని ఆ సంఘం అధ్యక్షుడు సుధీర్‌కుమార్, ఏపీటీఎఫ్ పతాకాన్ని ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకులు జి.సత్యనారాయణ ఆవిష్కరించనున్నారు. ఈ మహాసభలను ఏఐఎఫ్‌ఆర్‌టీఈ ఛైర్మన్ ప్రొ.జగ్‌మోహన్ సింగ్ ప్రారంభించనున్నారు.

ఆ ఉపాధ్యాయుల సర్వీసును క్రమబద్ధీకరించాలి



హృదయరాజుకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల: డీఎస్సీ-1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీసును క్రమబద్ధీకరించాలని.. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆ అసోసియేషన్ నాయకులు ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజుకు విజ్ఞప్తి చేశారు. నెల్లిమర్లలో శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. 1998లో ఎంపికై ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల తాము ఉద్యోగాన్ని, సర్వీసును నష్టపోయామని అన్నారు. ఎంటీఎస్ ప్రాతిపదికన నియమించిన తమ సర్వీసును క్రమబద్ధీకరించే అంశంపై ఏపీటీఎఫ్ మహాసభల్లో చర్చించాలని, ప్రభుత్వానికి నివేదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంతిన అప్పలరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మణరావు, జిల్లా కోశాధికారి గోపీనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణకు 53 మంది ఎంపిక



జెండా ఊపి విద్యార్థుల బస్సును ప్రారంభిస్తున్న సురేష్

చీపురుపల్లి: చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 53 మంది విద్యార్థులు ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణకు ఎంపికయ్యారు. వీరంతా 9, 10 చదువుతున్న విద్యార్థులు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఈ నెల 5 నుంచి 14 వరకూ వీరికి శిక్షణ ఉంటుందని పాఠశాల ఎన్‌సీసీ అధికారి మామిడి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థుల బస్సుకు ఎస్‌ఎంసీ ఛైర్మెన్ గవిడి సురేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు, ఇప్పిలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన రవిశేఖర్

నెల్లిమర్ల: రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ శనివారం రాత్రి మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కొద్ది సేపు ముఖాముఖిగా మాట్లాడారు. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులను, సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి లోకేష్‌ను కలిసిన వారిలో మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు తదితరులు ఉన్నారు.

సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి



డీఎల్‌డీవో హేమసుందరరావు

చీపురుపల్లి: చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో సంక్షేమ కార్యక్రమాల అమలుకు తన వంతు కృషి చేస్తానని డివిజినల్ అభివృద్ధి అధికారి కె. హేమసుందరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం ఎంపీడీఓగా పని చేసి పదోన్నతిపై వచ్చిన ఆయన శనివారం డీఎల్‌డీఓగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చీపురుపల్లి, రాజాం నియోజవర్గాల్లో తమ శాఖ పరిధిలోని అంశాలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారంతో పర్యవేక్షిస్తానన్నారు.

దుకాణాలను పరిశీలించిన కమిషనర్



దుకాణదారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లిమర్ల: జరజాపుపేటలో ఉన్న నగర పంచాయితీకి చెందిన ఐదు దుకాణాలను కొత్త కమిషనర్ కె.అప్పలరాజు శనివారం పరిశీలించారు. ఆ దుకాణాలకు సంబంధించి అద్దె చెల్లింపు తీరుతెన్నులపై ఆయన ఆరా తీశారు. ఎలాంటి బకాయిలు లేకుండా సక్రమంగా అద్దె చెల్లించాలని దుకాణదారులకు సూచించారు. అనంతరం జరజాపుపేటలోని 1వ వార్డు సచివాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేనేజర్ ఎం.వి.రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చీపురుపల్లి ఎంపీడీవోగా సరళ

చీపురుపల్లి: చీపురుపల్లి ఎంపీడీఓగా ఎ.సరళ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నెల్లూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన కె. రామకృష్ణరాజు బదిలీపై నెల్లిమర్ల వెళ్లారు. ఈఓపీఆర్డీగా నియమితులైన ఇప్పలవలస సురేష్ కూడా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన అన్నపూర్ణాదేవికి గుర్లకు బదిలీ అయ్యింది. బాధ్యతలు చేపట్టిన సరళకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి




సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

గజపతినగరం: డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించే విధంగా వారిని ప్రోత్సహించాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో క్లస్టర్ పరిధిలో గల సంఘాల అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌వీఈపీ ద్వారా మహిళలకు అవసరమైన రుణాలను మంజూరు చేయాలని సూచించారు. చిరు వ్యాపారాలపై పెట్టుబడులు పెట్టించి.. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమం, పెట్టుబడులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సీతారామ స్వామి దేవాలయం



ఎం.గుమడాంలో దేవదాయ భూముల్లో సాగు చేస్తున్న వరిపంట

కౌలు పేరు.. కథలు వేరు!

- తొమ్మిదేళ్లుగా వేలం వేయని వైనం
- రూ.లక్షల్లో పేరుకుపోయిన బకాయిలు
- కౌలుదారుల నుంచి చేజారిపోతున్న ఆలయ భూములు
- ఆదాయం కోల్పోతున్న సీతారాములు

గజపతినగరం: స్థానిక సీతారామ స్వామి ఆలయానికి చెందిన భూములు ప్రస్తుతం ఆక్రమణదారుల చేతిలోకి వెళ్లిపోతున్నాయి. ఏటా దేవదాయ భూములకు వేలం నిర్వహించి... ఆ ఆదాయాన్ని దూప, దీప, నైవేద్యాలతో పాటు అర్చకులకు జీతాలు, ఇతర ఖర్చులకు వెచ్చించే వారు. సీతారామ స్వామి దేవాలయానికి మండలంలోని ఐదు గ్రామాలలో భూములు ఉన్నాయి. శ్రీరంగ రాజపురంలో 49 ఎకరాల 23 సెంట్లు, ఎం.గుమడాంలో 19 ఎకరాల 3సెంట్లు, కనిమెరకలో 29 సెంట్లు, గజపతి నగరంలో 34సెంట్లు, మదుపాడ గ్రామంలో 62 సెంట్లు... మొత్తంగా 69 ఎకరాల 51 సెంట్ల భూమిని 23 మంది రైతులు కౌలుకు తీసుకున్నారు. దీనికి గాను ఏటా గతంలో రూ.98వేల 475 వంతున రైతులు చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇలా 2014 వరకు సాఫీగా జరిగింది. ఆ ఏడాదితో కౌలు కాలం ముగియడంతో 2015 నుంచి నేటి వరకు 9 ఏళ్లుగా వేలం పాట నిర్వహించడం లేదు. దీంతో కౌలు బకాయిలు రూ.లక్షలో పేరుకుపోతున్నాయి. రికార్డుల పరంగా 2019-20కి రూ.లక్షా 20వేల 985, 20-21కి సంబంధించి రూ.13వేల 470, 21-22కి సంబంధించి రూ.లక్షా 7వేలు మాత్రమే చెల్లించారు. మిగిలిన కౌలు రూ.లక్షల్లో పేరుకు పోయింది. కొంతమంది రైతులు తమకు నచ్చినవిధంగా భూములను ఇతరులకు తనఖాకు అప్పగించినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

- ఎం.గుమడాం గ్రామానికి చెందిన కౌలు రైతు అదే గ్రామానికి చెందిన నలుగురు రైతుల నుంచి రూ.2లక్షలు తీసుకొని సబ్ లీజ్‌కు ఇచ్చినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇలా ఐదు గ్రామాల్లో అసలైన కౌలుదారుల నుంచి ఇతరుల చేతికి భూములు వెళ్లినట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. కొంత కాలంగా రెగ్యులర్ ఈఓ లేకపోవడం... ఇన్‌చార్జి పాలన సాగుతుండడంతో భూములు వేలం వేయడం లేదు. ఈ ఏడాది రెగ్యులర్ ఈఓ రావడంతో దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం..

దేవదాయ భూములకు త్వరలో వేలం వేస్తాం. గతంలో ఇన్‌చార్జి ఈఓలు ఉండడం వల్ల జాప్యం జరిగింది. దేవదాయ భూములు రికార్డుల్లో ఉన్న కౌలు రైతుల వద్దనే ఉండాలి. లదంటే చట్టపరమైన చర్యలు చేపడతాం. కౌలు రైతుల నుంచి బకాయిల వసూళ్లను వేగవంతం చేస్తాం.

-శ్రీరాం, ఈవో, గజపతినగరం

శిథిలావస్థలో మురుగు కాల్వలు



మురుగు కాల్వ శిథిలమైన దృశ్యం

నెల్లిమర్ల: నగర పంచాయితీ పరిధిలోని కీర్తివీధిలో మురుగు కాల్వలు శిథిలం కావడంతో పాటు వాటిపై ఎలాంటి పలకలు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువ గోడలు శిథిలం కావడంతో దాటేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షాలు పడే రోజుల్లో ఈ కష్టాలు మరింత రెట్టింపవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మురుగు నీరు ఇళ్లల్లోకి చేరుతోందని అంటున్నారు. కొన్ని చోట్ల కాల్వల మీద చెక్కలు వేసుకుని తాత్కాలిక పరిష్కార చర్యలు చేపట్టారు. ఇప్పటికైనా నగర పంచాయితీ అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కీర్తి వీధి వాసులు డిమాండ్ చేస్తున్నారు.

రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం



కోతకు గురైన రహదారి

డెంకాడ(భోగాపురం): భోగాపురం మండలం ముగడపేట ఆర్‌అండ్‌బీ రహదారి వర్షాలకు పూర్తిగా దెబ్బతిని ప్రమాదభరితంగా ఉంది. వివిధ గ్రామాల ప్రజలు భయాందోళనతో రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటేనే వాహన చోదకులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి... దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేయించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

గ్రామసభలో పనుల గుర్తింపు

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీలో సర్పంచ్ బి.పట్టాభి, కార్యదర్శి శైలజ ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. అభివృద్ధి పనులు గుర్తించారు. ఈ సందర్భంగా సర్పంచ్, కార్యదర్శి మూడేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి పనులు, శానిటేషన్‌తో పాటు పలు ఖర్చుల వివరాలు, సుమారు కోటి రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చీపురుపల్లి, బొబ్బిలి డీఎస్పీలు రాఘవులు, పి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాజాం, బొబ్బిలి కళాశాలల్లో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.



రాజాం: విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం రూరల్: యువకులు తాత్కాలిక సుఖం కోసం గంజాయి, మద్యం, సిగరెట్లు వంటి దుర్వసనాలకు దగ్గరై భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు తెలిపారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఏదైనా సాధించాలన్న పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాగా మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలోని ఓ కళాశాలలో శనివారం సంకల్పం కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్ వాడితే వాటి వల్ల వచ్చే అనర్థాలు గురించి బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో సేవలందించండి



జీవిత కాల సభ్యత్వాలు ఇస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా చేరి సమాజానికి సేవలందించాలని ఆ సొసైటీ విజయనగరం ఛైర్మన్ కేఆర్‌డీ ప్రసాదు కోరారు. శనివారం బొబ్బిలిలో రోటరీక్లబ్ అధ్యక్షుడు సింద్రీ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో క్లబ్ డైరెక్టర్లు, సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 25 మంది సభ్యులు జీవితకాల సభ్యులుగా చేరారు. కార్యక్ర మంలో రోటరీ జిల్లా ఛైర్మన్ జేసీ రాజు, ఎన్‌జీవో సంఘం అధ్యక్షులు రౌతు రామ్మూర్తి నాయుడు, విశ్రాంత తహసీల్దార్ టి.రామారావు, జి.అప్పల నాయుడు, కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

బొబ్బిలిలో వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

బొబ్బిలి: బొబ్బిలిలో సత్యసాయి సేవాసంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీలో 985 మంది పాల్గొన్నట్లు ఆ సంస్థ స్థానిక కన్వీనర్ బేతనపల్లి లక్ష్మణరావు తెలిపారు. బొబ్బిలి చుట్టుపక్కల గల 18 ఉన్నతపాఠశాలలు, ఆరు జూనియర్ కళాశాలలు, ఐదు డిగ్రీ కళాశాలల విద్యార్థులు వ్యాసరచన పోటీలో పాల్గొన్నట్లు చెప్పారు.మానవతా విలువలపై ప్రేరణ రగిలించే అంశాల ఆధారంగా వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలో విజేతలకు బంగారు పతకాలను తమ సంస్థ బహూకరిస్తుందని పేర్కొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో చండీయాగం

పాలకొండ: పట్టణంలోని కాశీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం చండీ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ యాగంలో చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు జోస్యుల అంజిబాబు ఆయనతో రుద్రాభిషేకం, చండీయాగం చేయించారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనులకు ప్రతిపాదనలు రూపొందించండి

గజపతినగరం: గ్రామ పంచాయితీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని ఎంపీడీఓ బి.కళ్యాణి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 గ్రామ పంచాయితీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి కొత్తగా చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మార్చి నాటికి ఉన్న నిధులు.. చేపట్టిన పనులకు సంబంధించి.. యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సింగవరం కార్యదర్శిగా షేక్ వహీదా

డెంకాడ: మండలంలోని సింగవరం పంచాయితీ కార్యదర్శిగా షేక్ వహీదా రెహమాన్ శనివారం బాధ్యతలు చేపట్టినట్టు సర్పంచ్ పిట్టా అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి షేక్ వహీదా రెహమాన్ మాట్లాడుతూ పంచాయితీలో అభివృద్ధి కార్య క్రమాలకు శ్రీకారం చుడతామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీరు, పారిశుధ్య పనులు చేపడతామని తెలిపారు.

తోటపల్లి ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

గరుగుబిల్లి: ఉత్తరాంధ్రలో చిన తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవేంకటేశ్వర, కోదండ రామస్వామి ఆలయాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని పాలకొండ డీఎస్పీ రాంబాబు హామీ ఇచ్చారని జట్టు సంస్థ వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు తెలిపారు. ఆయన శనివారం పాలకొండలో డీఎస్పీని కలిశారు. ఈసందర్భంగా తోటపల్లి ఆలయ అభివృద్ధికి కొంతమంది ఆటంకం కల్పిస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తెలియజేశారు. ఆలయ ప్రాంతంలోని కొంతమేర స్థలం ఆక్రమణకు గురైందని, ఆక్రమణదారులు తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఆలయ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతామని డీఎస్పీ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. డీఎస్పీని కలిసిన వారిలో హరికుమార్, కొండలరావు, నాని ఉన్నారు.

విజయవాడకు సైకిల్ యాత్ర

సాలూరు రూరల్: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీక్ష నేపథ్యంలో మామిడిపల్లి నుంచి భవానీ గురుస్వామి మరడ విష్ణుమూర్తి శనివారం విజయవాడకు సైకిల్ యాత్ర ప్రారంభించారు. మార్గమధ్యలో సనాతన ధర్మం, తిరుమల లడ్డూ ప్రాశస్త్యంపై భక్తులకు వివరించనున్నట్టు ఆయన తెలిపారు.

రహదారులకు అంచనాలు

మక్కువ: శంబరలో పోలమాంబ అమ్మవారి జాతర సమయంలో సిరిమాను తిరిగే ప్రదేశాలు, చదురుగుడి, వనంగుడి సమీప ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించడానికి పీఆర్‌డీఈ చిన్నమనాయుడు శనివారం అంచనాలు రూపొందించారు. ఎన్ని మీటర్ల మేర రహదారి నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందో కొలతలు తీశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, పీఆర్‌ఏఈ రంజిత్ పాల్గొన్నారు.